భలే అల్లుడు

యస్. శ్రీకృష్ణారావు

"చేతిలో వుత్తరాన్ని పెట్టుకొని అలాగే కూర్చుంటే ఎల్లాగ, ఇక జరగవలసినది ఏమిటో ఆలోచించక?" అంది సుభద్ర. భార్యమాటలు విని అరికాలిమంట నెత్తికెక్కింది సుబ్రమణ్యానికి.

"నీకేం! చాలా సులభంగా అనేశావు. డబ్బుకోసం ఎక్కడికి వెళ్ళాలో నాకేమీ అర్థంకావటములేదు," అన్నాడు సుబ్రమణ్యం కొంచెం కటువుగానే.

"డబ్బు! డబ్బు! చావొచ్చి పడిపోయిం దీ రొంపలో! ప్రతిదానికి డబ్బు ఎక్కడవుందన్న గొడవ తప్పితే మరొకటిలేదు. మరిపండగ ఎల్లా గడుస్తుంది? మన పిల్లకి మనం చెయ్యకపోతే మరెవరు చేస్తారు? పోనీ వాళ్ళేమైనా గోరంతలు కొండంతలుగా అడుగుతున్నారా? ఈ మాత్రమేనా చెయ్యకపోతే మనకేమైనా మర్యాదగా వుంటుందా?"

"బాగుంది నీ వరస! ఉత్తరం చూసేనా నువ్వు మాట్లాడేది? వేలికి వజ్రపు వుంగరము, చేతికి రిస్టువాచీ, పార్కరుపెన్, "ట్వీడ్ సూట్"–రానుపోను సెకండుక్లాసు రైలు చార్జీలు – ఇదంతా ఎంత అవుతుందో తెలుసా? కనీసం అయిదువందలేనా కావాలి! ఎక్కడికి వెళ్ళమంటావు ఇప్పుడు అంత డబ్బుకోసం? అనవసరంగా అకతవక వాగుడు వాగకు."

"అంతా ఎంత అవుతుందో నాకనవసరం. మన అల్లుడికి మనం ఎంత

కావాలన్నా ఇవ్వొచ్చు. తన మంచితనానికి, తన మంచిగుణాలకీ, తనబుద్ధిచాతుర్యానికి ఇదేమంత పెద్ద ఖర్చుకాదు."

"అవునవును! తను మహా చాణుక్యుడూ! సత్యవంతుడూనూ ఇవ్వొచ్చుట! ఇవ్వొచ్చు! మహా సిఫార్సు చేయొచ్చావు!"

సమయం బాగుండలేదని సుభద్ర లోపల కెళ్ళిపోయింది.

సుబ్రమణ్యం అసలు డబ్బు విషయంలో చాలా గట్టిమనిషి. చాలా బీదకుటుంబంలో నుంచి అనేక కష్టాలు అనుభవించిన తర్వాత తన ఒక్క చేతిమీదే పైకి వచ్చినవాడు. అందుచేత డబ్బువిలువ తనకు బాగా తెలుసు. ఒక్క కానీ ఖర్చు పెట్టాలన్నా తగినంత ఆలోచన చేస్తేనేగాని ఖర్చు చేయడు. ఈయన పద్ధతి భార్యకు కొంచెం కూడా గిట్టదు. ఏ సమయంలో ఎలా ఖర్చుపెట్టాలో ఈయనకు తెలియటం లేదే అని బాధపడుతుంది. క్రిందటి సంవత్సరమే వారి ఏకైక పుత్రిక శోభకు వివాహం జరిగింది. శోభ అదృష్టంకొద్దీ మంచిచోటే దొరికింది. చాల మంచి సాంప్రదాయ మనుకొని, తనశక్తికి మించిన ఖర్చుచేశాడు సుబ్రమణ్యం. డబ్బు నీళ్ళలా ఖర్చయిపోతోందే అని అనుకొనే అతడి భావాలకు సుభద్ర ఇచ్చిన తగిన సమాధానాలతో వివాహం సలక్షణంగా జరిగిపోయింది. శోభ వివాహం జరిగిన తరువాత అదే మొదటి సంక్రాంతి పండుగ. అదే మొదటిసారి అల్లుడు పండక్కి అత్తవారింటికి రావటం.

"ఏమాలోచించారు చివరకు? గబగబా ఏదో ఒకటి తేల్చేగుణము మీకసలు లేనే లేదు" అంటూ తయారయింది సుభద్ర.

"దీనికో పెద్ద ఆలోచన ఏమిటి? మన శక్తికి తగినట్లు ఏదో ఒకటి చేస్తాం. వాళ్ళు అడుగుతున్నారని తలకు మించిన పని చేస్తామా!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మన శక్తికి తగినదంటే వాళ్ళూరుకో వద్దూ! అసలు పెళ్ళిలోనే వాళ్ళకి ఎడమొహాలూ పెడమొహాలూ వచ్చాయి!"

"ఏమేవ్! నువ్వసలు నోర్మూయ్! ... నువ్వు మాట్లాడకుండావుంటే నేను చేసిన దానికి వాళ్ళే ఒప్పుకుంటారు. అందులో ఈ పండక్కి అతను తప్పితే ఇంకెవరూ రారు. సురేష్‌కు మన పరిస్థితి అంతా బాగా తెలుసు. పెళ్ళిలోనే నేను చేసిన ఖర్చుకు చాలా బాధపడ్డాడు. అందుచేత మనం చేసినదానికి అతను ఏమీ అనడు. పానకంలో పుడకలా నువ్వు అనవసరంగా కలగచేసుకోకు!"

"ఈ పప్పులేం వుడకవు అల్లుడిదగ్గర. శోభ కొచ్చిన వుత్తరంచూస్తే తెలుస్తుంది అతని మనస్సులోని సంగతి!"

"ఆ! ... శోభకు వుత్తరం వచ్చిందా! అతని దగ్గర్నుంచే? అమ్మాయి శోభా! ఇల్లారా!..."

"ఏం నాన్నా?" అంటూ వచ్చింది శోభ.

"ఏమ్మా! ఉత్తరం వచ్చిందిట కదూ! నాతో చెప్పనేలేదే!" అంటూ నవ్వుతూ వాత్సల్యంతో ప్రశ్నించాడు కూతురిని సుబ్రహ్మణ్యం.

సిగ్గు ఆమెను ఆవరించటంవల్ల శోభ మాట్లాడలేదు.

"ఉత్తరంలో ఏమైనా ముఖ్యవిషయాలు...ఉన్నాయా?" అంటూ మళ్ళీ నవ్వుతూనే ప్రశ్నించాడు సుబ్రమణ్యం.

శోభ మౌనం...

"నువ్వు నాకు ఉత్తరం ఇవ్వనక్కర్లేదమ్మా! మాతో చెప్పవలసిన విషయాలు ఏమైనావుంటే..."

"ఏమిలేవు నాన్నా. సంక్రాంతి పండుగ చాలా జోరుగా వుంటుంది కాబోలు అని రాశారు అంతే" అని లోపలికి వెళ్ళిపోయింది శోభ.

"చాలా జోరుగా......అంటే సందేహంగానే వుం··!"అన్నారు సుబ్రమణ్యం.

"చాలా జోరుగా అంటే, చాలా బాగా ఎవళ్ళ మనస్సులూ బాధపడకుండా సంతోషంగా వుంటుందని అర్థం" అంది సుభద్ర.

"ఓహో!...మరి అందరి సంతోషం కోసమేగా పండగ వస్తోంది." వ్యాఖ్యానాన్ని పూర్తిచేశాడు సుబ్రమణ్యం.

"అయినే చివరకి ఏం చేస్తారేమిటి?" చాలా ఖచ్చితంగా అడిగేసింది సుభద్ర.

"చేసేదేమిటి వల్లకాదు! ఇష్టమైతే వుంటాడు. కష్టమైతే తిరుగు టపాలో మూట కట్టేస్తాడు. శిల్కుపంచె, శిల్కుకండువ, దారి ఖర్చులకు యాభయి రూపాయలు. ప్రస్తుతానికి యింతే! మళ్ళీ సంక్రాంతికి అతను అడిగినవన్నీ ఇవ్వచ్చులే!"

"మరి ఉంగరం, గడియారం మాట."

"వాటికి డబ్బు?"

"డబ్బు రామశర్మగారు పంపుతాడని చెప్పారుగా?"

"వాణ్ణి నమ్మినమాట నిజమే. కాని ఇంత వరకూ వాడు వుత్తరంకూడ రాయలేదు. మన డబ్బు మనకు ఇవ్వటానికే వాడికి కష్టంగా వుంది."

"అసలు మీరు సరిగా అడిగితేకదూ? ఆ డబ్బు వచ్చినట్లయితే అది ఈ పండక్కి ఎక్కడ ఖర్చయిపోతుందో అని మీ భయం! పెళ్ళంటూ అయినతరువాత ఇదేకదా మొదటి పండగ? పోనీ ఒక వుంగరమేనా ఇచ్చేందుకు ఏర్పాటుచేయండి. మనకోసం కాకపోయినా మన మర్యాదకోసమయినా ఇవ్వద్దా" అది సుభద్ర.

"ఆరంభించావా నీ పల్లవి! తగలడినట్టే వుంది మన మర్యాద. ఈ డబ్బుకోసం నన్ను ఏ గోతిలో దిగమంటావో చెప్పు...దిగుతాను. నీకెందుకీ శ్రమ. సురేష్ నేను చెప్పినట్లు వినేటటుగా చేస్తాను. నువ్వు అనవసరంగా దిగులుపడకు......"

"అల్లుడు ఒప్పుకొంటే సరిపోతుందా ఏమిటి! అతని వాళ్లు ఒప్పుకోవద్దూ! రేపు ఈ విషయాన్ని ఆధారంగా తీసుకొని ఏదేనా గొడవ చేస్తే మన శోభ కదా కండ్లు వలుపు కుంటూ కూర్చొంటుంది!"—అంది. సుభద్రకు ఏడుపుకూడ వచ్చింది.

"భగవంతుడా!...ఎవళ్లికేనా సమాధానం చెప్పవచ్చు కాని ఇంట్లో ఇల్లాలికిమాత్రం సమాధానం చెప్పలేమన్నారు ఇందుకే కాబోలు. మహాప్రభో! నీకో నమస్కారం గాని నువ్వు లోపలికి వెళ్లు! ఈపండగ సమాచారమంతా నాకు వదలిపెట్టు. ఆ సంగతి నేను చూసుకొంటాను. రేపు ఏదేనా గొడవ వస్తే నాది జవాబుదారీ! కావాలంటే వాళ్లి కాళ్లుకూడా పట్టుకొంటాను, సరేనా! ఇక నువ్వు వెళ్లి నీ పని చూసుకో," అని ముగించారు సుబ్రమణ్యం.

సుభద్ర ఓ విధంగా తృప్తిపడి లోపలికి వెళ్లిపోయింది.

సంక్రాంతి పండుగ దగ్గరకొస్తున్నకొద్దీ సుభద్రకు ఒకటే హడావుడి. భోగినాటికి ముందురోజునే వస్తున్నట్లు సురేష్ ఉత్తరం వ్రాశాడు. ఉత్తరం చూసిన తరువాత సుభద్ర కింగారు చెప్పనక్కరేదు. అల్లుడి సంబంధించి సుబ్రమణ్యం గారికి పరిస్థితి అంతా అయోమయం.

అనుకొన్నట్లుగానే అల్లుడు రానే వచ్చాడు. మర్యాద తక్కువ అవుతుందేమో నన్న భయంతో సుబ్రమణ్యంగారు స్టేషనుకువెళ్లి అల్లుడిని తీసుకొని వచ్చాడు. తనతోకూడా తనవాళ్లెవరూ రాకపోవటంవల్ల, మామగారింట్లో ఇటుసరి ఏమిచేయకుండా చాలా సహజంగానే ప్రవర్తించాడు సురేష్.

"ఇంటిదగ్గర అందరూ కులాసాయేనా నాయనా!" అమ్మగారిని కూడా తీసుకొని వస్తే చాలా బాగుండేది. ఏం నాయనా అంత చిక్కిపోయావు?" మాతృవాత్సల్యంతో ప్రశ్నించింది అల్లుణ్ణి సుభద్ర.

"అంతా కులాసాయేనండి. నాన్నగారికి "ఆస్తమా" కదా! అందుచేత అమ్మరావటానికి వీల్లేకపోయింది" అంటూ నవ్వుతూనే సమాధాన మిచ్చాడు సురేష్.

"'ఆస్తమా'కి ఒకటేమందు. ఆసనాలు వేయటమే. నా స్నేహితుడొకడు వందల కొలది డబ్బుఖర్చుచేసినా వ్యాధితగ్గలేదు. చివరకు ఎవరో ఒక యోగి అతనిపరిస్థితి చూచి జాలిపడి కొన్ని ఆసనాలు చెప్పివే

★ భలే అల్లుడు ★

యించాడుట. ఇప్పుడుభీముడులావున్నాడు," అంటూ సావిట్లోవున్న ఉయ్యాలబల్లమీద పద్మాసనం వేసుక్కూర్చొన్నారు సుబ్రమణ్యం.

అల్లుడూ మామ లోకాభిరామాయణం తిరగవేస్తున్న సమయంలో సురేష్‌కు ఒకటో రకమైన కాఫీవచ్చింది.

మధ్యాహ్నం భోజనాలయాక మేడమీద గదిలో కొంచెంసేపు నిద్రపోయి, తన ప్రయాణ బడలికను తీర్చుకున్నాడు సురేష్. సాయంత్రం సుమారు అయిదుగంటలకు మెలుకువ వచ్చింది.

ఆకాశమంతా దట్టమైన మేఘాలతో నిండి చిన్న చిన్న తుంపరలు రాల్తున్నాయి. చల్లటిగాలి వస్తోంది. మేడమీద తను ఒంటరిగానే వున్నాడు—ఆసమయంలో తన ప్రియురాలు శోభ జ్ఞాపకం రావటంలో ఆశ్చర్యంలేదు! తన శోభవిషయం ఆలోచిస్తున్న సమయంలోనే తలుపుదగ్గర గాజులు శబ్దం చిన్నగా విన్పించింది. వెనక్కు తిరిగి చూశాడు సురేష్.

కాఫీ ఫలహారాలతో శోభ ప్రత్యక్షమయింది!

"నిన్ను గురించే ఆలోచిస్తున్నాను. నువ్వే వచ్చేశావు" అన్నాడు సురేష్.

శోభ మాట్లాడకుండా కాఫీ ఫలహారాలు బల్లమీద పెట్టి అల్లాగే నిలబడింది.

"ఏం శోభా మాట్లాడవు? నామీద కోపమా?" అన్నాడు సురేష్ బ్రతిమాలే భావనతో.

"ఉత్తరాలనేవి అల్లాగే రాస్తారు కాబోలు. ఎవరేనా చూస్తే" అంది శోభ మెల్లిగా.

"తప్పుమాటలేం రాయలేదే?"

"తప్పు మాటలు లేకపోతే మాత్రం?"

"నా వుత్తరం నీకు తప్ప మరొకరి చేతికి వెళ్ళదని నాకు బాగా తెలుసు. అందుకనే ధైర్యంచేసి రాశాను."

"ఒకవేళ కాలం ఖర్మకాలి ఎవరేనా చూస్తే?"

"ఆ! చూస్తే మాత్రం చంపేస్తారా! మనిద్దరమూ పెళ్లయిన వాళ్ళమేకాని, కాని వాళ్లము కాదుకదా! ఒకవేళ చూస్తే కొంచెంసేపు వాళ్లలో వాళ్ళు నవ్వుకొని నోరుమూసుకొని కూర్చొంటారు. ఇంకా కొంచెము గటివాళ్లయితే మనం ఎదురపడినపుడు మనమాటలను మనపైపే సిసింద్రీలలా వదుల్తారు. అటువంటి వాళ్ళందరికి తారాజువ్వలా సమాధానం చెప్పేందుకు నేనుండగా నీకెందుకు భయము?"

"ఏమైనప్పటికి అటువంటి ఉత్తరాలు నాకు కోపాన్ని తెప్పిస్తాయి!"

"ఓహో!...సరేగాని...నాకు తెలియక అడుగుతాను. ఆ వుత్తరం నీకన్నా ముందు ఇంకెవరేనా చదివారా?"

"లేదు. ముందు నేనే చదివాను. ఇంతట్లోకి అమ్మ వచ్చింది. ఉత్తరం ఇవ్వమంది"

"నువ్వు ఇచ్చావుకాబోలు"

"ఊహు! ఏమంత ముఖ్యవిషయాలు లేవని చెప్పాను. అంతేకాని ఉత్తరం ఇవ్వలేదు."

"మరి ఇంతటి దానికి అంత ఖంగారు పడతావెందుకు? ఎల్లా అయిన ఈ పల్లెటూరి వాతావరణం నిన్ను ఇల్లాగే మాట్లాడిస్తుంది. ఈసారి అత్తవారి ఇంటినుంచి పుట్టింటికి వచ్చినపుడు నాకు ఉత్తరాలు రాస్తావు చూడు! అపుడు నేను నీకు చెపాల్సి వస్తుంది ఇటువంటి ఉత్తరాలు వ్రాయద్దని" అంటూ చమత్కరించాడు సురేష్ చిలిపిగా.

"చాలా సంతోషించాం గాని కాఫీ తాగండి చల్లారి పోతోంది."

"నిన్ను చూస్తూ కాఫీ సంగతే మర్చిపోయాను చూశావా!" అన్నాడు సురేష్ కొంటెగా.



"ఇప్పై విరుందు"—ప్రతిశుక్రవారము రేడియో సిలోన్ 41.72 మీటర్లమీద సాయంత్రం 6-30 నుండి 6-45 వరకు విని ఆనందించండి.

కాఫీ ఫలహారం పూర్తయింది.

"మరి..." అంటూ దగ్గరకువచ్చి ఏదో చెప్పబోయాడు సురేష్.

"నాకు తెలుసు లెండి మీ నాటకం. ...." అంటూ గబగబా కిందకు వెళ్ళిపోయింది శోభ. ఆ తర్వాత కొంత సేపటికి మామగారు మేడమీదకు వెళ్లారు.

"ఏం సురేష్ బాగా నిద్ర పట్టిందా!"

"ఆహా!...మీ మేడ చాలా సౌకర్యంగా వుంది...మీరు పండక్కి కొన్న బట్టలు చూశాను..." అంటూ మెల్లిగా సంభాషణ ప్రారంభించాడు సురేష్.

"ఓహో!.....బాగున్నాయా? నీకు తృప్తే కాదా?"

"అన్నీ బాగానే వున్నాయి కాని..."

"ఆ!...ఆ!....మనస్సులో వున్నది చెప్పు సురేష్. ఇదేమన్నా పరాయిచోటా?"

"నా మట్టుకు మీరు ఏం చేసినా పరమ తృప్తే. కాని మా అమ్మగారున్నారు చూశారూ! చాలా పట్టుదల మనిషి. ఉంగరం, గడియారం లేకుండా రావద్దని చెప్పేసింది. ఏమైనప్పటికి పెద్దవాళ్ళు చెప్పినట్లు వినాలికదా? అన్నాడు సురేష్.

సుబ్రమణ్యంగారికి ఎలక్ట్రిక్ షాక్ తగిలినంత పని అయింది. తనతో చెప్పకుండా, శోభ, బట్టలు తెచ్చిచూపించిన ఫలితం ఇదంతా అనుకొన్నారు. ఇంకా ఏమేమి చెప్పిందో! మీ రడిగితే లేదనరు అనికూడా చెప్పేవుంటుంది! ఆలోచించగా ఆలోచించగా కన్న కూతురుమీదే పట్టలేనికోపం వచ్చింది.

"ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అని అడిగాడు సురేష్.

"అబ్బే! ఏంలేదు సురేష్!...ప్రస్తుతంలో డబ్బు సర్దుబాటుకాలేదు. అంతకంటే ఇంకేమీలేదు" అంటూ నసిగారు సుబ్రమణ్యం.

"కనీసం మా అమ్మగారి తృప్తికోసం మీరు అవి తేవటం అవసరం. అల్లా అయితే నే వచ్చేనెలలో మా కాపరం పెట్టుకోవటానికి వీలవుతుంది. అందుకని..." ఇదండి అంటూ నాలుగు నూరురూపాయలు నోట్లూ ఆయన చేతిలో పెట్టాడు సురేష్!!

"ఏమిటి సురేష్ యిది?" అంటూ తెల్లబోయారు సుబ్రమణ్యం.

"డబ్బును గురించి ఇబ్బంది పడుతున్నానన్నారు కదూ? దీనితో జరగవలసినది జరిపించండి. ఎల్లా అయితేనేం మా అమ్మగారు సంతోషిస్తే అంతే చాలు."

"రేపు ఈ విషయం మీ వాళ్లకు తెలిస్తే?..."

"ఎవ్వరికీ తెలియదు. నే చెప్తే కదా తెలియటానికి! ఇది మన మనస్సులలోనే వుంటుంది" అంటూ లేచాడు సురేష్.

సుబ్రమణ్యంగారి ఆశ్చర్యానికి సంతోషానికి పట్టపగ్గాలులేవు. "నా అల్లుడు ఇంత మంచివాడా!" అనుకొన్నాడు తనలో.

మర్నాడు సంక్రాంతి పండుగ వారింట్లో ఎల్లా వుందో వేరే చెప్పనక్కర్లేదు. అంతకు ముందే కొన్న బట్టలతోపాటు, రెండు వందల విలువైన 'రిష్టువాచీ' కూడా సురేష్ చేతికి వచ్చాయి.

వేలికి సరిపోయే వుంగరం వెంటనే దొరకక పోవటంవల్లా అందునిమిత్తం, పార్కరు పెన్ను నిమిత్తం మరొక రెండువందలు కూడ సురేష్‌కు చేరాయి. చివరకు అడిగినవన్నీ సమకూరటం వల్ల సుభద్రకూడా చాలసంతోషించింది.

"మీరు బట్టలతోటిమాత్రమే ఈ పండుగ అనిచెప్పి, గడియారం కొనటమే కాకుండ రెండువందలు కూడా చేతికి ఇచ్చారే! ఈ నాటకమంతా ఆడింది నన్ను ఏడిపించటానికే కదూ? మీ మగాళ్ళు ఎప్పుడూ ఇంతే! ఆడదంటే మహాలోకువ. ఎంతసేపూ ఆడదాన్ని ఎలా ఏడిపిద్దామా అనే ఆలోచిస్తుంటారు." అని దెప్పి పొడిచింది భర్తను సుభద్ర.

అసలు రహస్యం అల్లుడు ఇంట్లో వుండగ చెప్పటం ఆయనకు ఇష్టములేదు. అందుకని 'మన అల్లుడికి మనం చేయకపోతే మరెవరు చేస్తారు?' అనేశాడు.

సంక్రాంతి వెళ్లిన మర్నాడు, అత్తమామలకు నమస్కరించి, ప్రియురాలికి, ఆమె కన్నీటికి తగిన సమాధానం చెప్పకొని వెళ్ళిపోయాడు సురేష్.

"అమ్మయ్య" అంటూ దీర్ఘశ్వాసాన్ని విడిచాడు సుబ్రమణ్యం. అనుకోని విధంగా ఈ సంక్రాంతి పండగ గడిచినందుకు ఆయనకు చాలా సంతోషం.

"అల్లుడిమనసు ఏమీ బాధపడలేదు కదా" అంటూ వచ్చింది సుభద్ర.

"బాధపడదూ మరి? నాలుగు వందలు కదా యిచ్చాడు" అన్నాడు సుబ్రమణ్యం పరిహాసంగా.

'ఆ!...' మూర్ఛపోయినంత పని అయింది సుభద్రకు. "మరేమిటనుకొన్నావు? తన చేతికిచ్చిన రెండు వందలూ, తనకి గడియారంకొన్న రెండు వందలూ ఎవరి డబ్బనుకుంటున్నావు? తన డబ్బే! ఇంకా వివరంగా చెప్పాలా! సురేష్ తన చేతినుంచి నాలుగు వందలు రూపాయలు తీసి తన తల్లి తృప్తికోసం ఆ వస్తువులు కొనమని నా కిచ్చాడు. గడియారం దొరికింది కాబట్టి మిగిలిన డబ్బు అతనికి ఇచ్చివేశాను. ఇప్పుడు అర్థమయిందా!"

"అయ్యో! అయ్యో! ఇంత అన్యాయం ఎక్కడేనా వుందా!"

"అన్యాయమూ లేదు – గిన్యాయమూ లేదు. మన అల్లుడికి మనమీదవున్న మమకారం అటువంటిది. ఆనాడే నేను చెప్పలేదూ అతని స్వభావము. కష్టపడేవాళ్ళను చూసి సహించలేడు. అతను ఈనాడు చేసిన ఉపకారానికి రెట్టింపు మనం వచ్చే సంవత్సరము చేద్దాం," అన్నాడు సుబ్రమణ్యం.

"ఏమైనా మీరు చేసిన పని ఏమీ బాగాలేదు. అతని డబ్బు తీసుకొని..."

"అదుగో మళ్ళీ అదేమాట! పని జరగటం ప్రధానమే పిచ్చిదానా! ఎందుకు అంత రాద్ధాంతం చేస్తావు? శోభ వస్తోంది. దాని చెవిని పడేను!"

"ఏమ్మా శోభా! ఇంకా నిద్రపోలేదా! మీ ఆయనకి రైల్లో బాగా స్థలం దొరికింది. వెళ్ళగానే నీకు ఉత్తరం వ్రాస్తానన్నాడు" అన్నారు సుబ్రమణ్యం కూతురుతో పరిహాసంగా.

"మద్రాసులోవున్న రామశర్మగారు మీకేమైనా బాకీ వున్నారా, నాన్నా?"

"అవునమ్మా యివ్వాలి. అయిదు వందలు ఇవ్వాలి. పంపుతానన్నాడు కాని యింకా పంపలేదు."

"ఆయన 'యీయన' దగ్గరికి వచ్చి మీకివ్వమని అయిదు వందలూ ఇచ్చారుట. అందులో నాలుగు వందలు మొన్న మాకిచ్చారుట. మిగిలిన వందలో యాభయి రూపాయలు తన ఖర్చులకు పోను మిగిలిన యాభయి రూపాయలు మీ కివ్వమని నా కిచ్చారు," అని సురేష్ తనకిచ్చిన యాభయి రూపాయలూ తండ్రికిచ్చింది శోభ.

"ఇదంతా సురేష్ నీతో ఎప్పుడు చెప్పాడు?" అని అడిగారు సుబ్రమణ్యం.

"బయలుదేరేముందు."

సుబ్రమణ్యం కొన్నిక్షణాలు ఏమీ మాట్లాడలేకపోయారు.

"డబ్బుయిచ్చేటప్పుడు రామశర్మయిచ్చాడని చెప్పలేదే" అన్నారు.

"తనచేతినుంచి ఇస్తున్నానని చెప్పాడు కాబోలు! తను గనుక రామశర్మగారు ఆ డబ్బు యిచ్చారని చెప్పివున్నట్లయితే మనస్ఫూర్తిగా ఆ డబ్బుఖర్చుపెట్టి వుండేవారా? ఇందులో సగంకూడా ఖర్చుపెట్టేవారుకాదేమో......ఇప్పటికేనా అర్థము చేసుకోగలరా.......ఈ అల్లుడిదగ్గర మన పప్పలేమీ వుడకవని......మా మంచిపని చేశాడు! భలే అల్లుడు...మావగారికి తగినవాడే" అంది సుభద్ర పరిహాసంగా.

"సామాన్యుడుకాదు. దేవాంతకుడు ఈ అల్లుడు" అని మాత్రం అన్నారు సుబ్రమణ్యం యింకేమీ అనలేక! ★